ప్రజాశక్తి
సోమవారం 5 ఆగస్టు, 2024
శ్రీకాకుళం



తెలుగు భాషను ప్రోత్సహించాలి

శ్రీకాకుళం అర్బన్: తెలుగుదనానికి పేరొందిన కరుణశ్రీ వంటి సహజ కవులను తలుచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పలువురు వక్తలు అన్నారు. జీవించినంత కాలం కవిత్వం రాసి, రాసినంత కాలమే జీవించిన కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి జయంతి ఉత్సవ సభను శ్రీకాకుళం తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. నగరంలోని గూనపాలెంలోని శాంతినికేతన్ కళాశాల ఆవరణలో రిటైర్డు జెడ్‌పి సిఇఒ సురంగి మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డు ఉప సంపాదకులు జంధ్యాల శరత్‌బాబు ముఖ్య వక్తగా మాట్లాడారు. సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్.వి రమణమూర్తి నిర్వహణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల ప్రధాన అధ్యాపకుడు అప్పలరాజు, కవులు కోమలరావు, శ్రీనివాసరావు, ఇద్ది పాపయ్య, నిక్కు హరి సత్యనారాయణ, ప్రసాద్, ఉపేంద్ర శర్మ, వి.రాజారావు తమ అభిప్రాయాలు వెల్లడించారు.

వేధింపులు... సాధింపులు

- అధికార మార్పిడితో స్కీమ్‌వర్కర్లకు ఇబ్బందులు
- రాజకీయ కక్షలతో నాడు వైసిపి ప్రభుత్వం తొలగింపు
- ఇప్పుడు కొందరు కూటమి నాయకుల వంతు
- నేడు కలెక్టరేట్ వద్ద నిరసన

రాష్ట్రంలో అధికార మార్పిడితో గ్రామాల్లో రాజకీయ కక్షసాధింపులు మొదలయ్యాయి. ఎన్నికల్లో తమకు ఓటు వేయలేదనో, వైసిపికి అనుకూలంగా పనిచేశారనో టిడిపికి చెందిన కొందరు నాయకులు ప్రతీకార చర్యలకు దిగుతున్నారు. అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులే లక్ష్యంగా వేధింపులకు దిగుతున్నారు. చాలీచాలనీ జీతాలు, గౌరవ వేతనాలతో బతుకీడుస్తున్న స్కీమ్‌వర్కర్లలో కొందరిని ఉన్నపళంగా ఇంటికి పంపేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మా ఇష్టం వచ్చినట్లు చేస్తాం... మీ దిక్కున్న చోట చెప్పకోండంటూ హుంకరిస్తున్నారు. జిల్లాలో పలుచోట్ల అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆశా కార్యకర్తలను తొలగించారు. దీంతో స్కీమ్‌వర్కర్లలో అందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో తమపై రాజకీయ కక్షసాధింపులు ఆపాలంటూ కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన చేపట్టనున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి


మంత్రి అచ్చెన్నాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు (ఫైల్)

జిల్లాలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో సుమారు 12 వేల మంది పనిచేస్తున్నారు. వీటిలో 2,759 మంది అంగన్‌వాడీ వర్కర్లు, అదే సంఖ్యలో హెల్పర్లు పనిచేస్తున్నారు. వీరితోపాటు 599 మంది మినీ అంగన్‌వాడీ వర్కర్స్ పనిచేస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకంలో సుమారు 6,300 మంది పనిచేస్తున్నారు. జాతీయ హెల్త్ మిషన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, అర్బన్ ప్రాంతాల్లో 2,170 మంది ఆశావర్కర్లు పనిచేస్తున్నారు. స్కీమ్‌వర్కర్లలో ఏ ఒక్కరికీ రూ.12 వేలకు మించి జీతం ఇవ్వడం లేదు. అంగన్‌వాడీ కార్యకర్తకు రూ.11,500 చెల్లిస్తుంటే, ఆయాకు రూ.7,500 ఇస్తున్నారు. ఆశా కార్యకర్తలతో నానా రకాల పనులు చేయించి చేతిలో రూ.10 వేలు పెడుతున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం కింద రూ.మూడు వేలు చెల్లిస్తున్నారు. స్కీమ్‌వర్కర్లకు పని భారం ఎక్కువైనా, ఇంట్లో ఇద్దరు పనిచేయకపోతే పూట గడవదనే ఉద్దేశంతో కష్టాలు, నష్టాలకోర్చి పనిచేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా వీరి బతుకులు మారడం లేదు. కనీస వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారంలో ఉన్న పాలక పార్టీల తీరు అలా ఉంటే, గ్రామాల్లో వారి నాయకులు కొందరు మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఆ రెండు పార్టీల్లో ఏ ఒక్క పార్టీ అధికారంలోకి వచ్చినా కొందరి ఉపాధి ఊడుతోంది.

రాజకీయ వేధింపులకు ఉదాహరణలు ఇవీ..

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్కీమ్‌వర్కర్లకు గ్రామాల్లో వేధింపులు మొదలయ్యాయి. వాటిని తాళలేక ఏకంగా ఉద్యోగాలనే విడిచిపెట్టేస్తున్న పరిస్థితి నెలకొంది. నందిగాం మండలం కొత్త అగ్రహారంలో మడ్డు సావిత్రమ్మ 24 ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తున్నారు. ఆ గ్రామంలో ఇద్దరు మహిళలు పనిచేస్తుండగా సావిత్రమ్మను పని నుంచి తీసేశారు. ఎన్నికల సమయంలో సావిత్రమ్మ కుమారుడు వైసిపి తరుపున ప్రచారం చేశారనే నెపంతో అక్కడి టిడిపి నాయకులు పట్టుబట్టి మరీ తొలగించారు. మెళియాపుట్టిలో ఓ వంట కార్మికురాలిని తొలగించేందుకు ప్రయత్నించగా, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం అడ్డుకోవడంతో అది నెరవేరలేదు. గార మండలం చిన్నముదిటిపేటలో పనిచేస్తున్న ఓ అంగన్‌వాడీ కార్యకర్తను వేధిస్తున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తగా ఉండడానికి వీల్లేదంటూ స్థానిక నాయకులు హూంకరిస్తున్నారు.

తొలగింపునకు వేలం పాటలు

తమకు ఇష్టం లేని అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన, ఆశా కార్యకర్తలను ఏదో రకంగా వదిలించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. డబ్బులు చెల్లించలేరని కొన్నిచోట్ల వేలం పాటలను నిర్వహించి వారిని సాగనంపేందుకు యత్నిస్తున్నారు. సంతబొమ్మాళి మండలం నట్టివలస పంచాయతీ గెద్దలపాడులో అంగన్‌వాడీ కార్యకర్తను తొలగించేందుకు రూ.1.90 లక్షలకు వేలం పాట నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నారన్న వార్తలతో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జోక్యం చేసుకుని అధికారులకు ఫిర్యాదు చేయడంతో ప్రస్తుతం అది ఆగింది. ఇదే గ్రామంలో ఆశా కార్యకర్త ఉద్యోగానికీ వేలం పాట నిర్వహించడంతో ఆశా వర్కర్స్ యూనియన్ ప్రతిఘటించడంతో ఆ ప్రకియ నిలిచింది.

ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. స్కీమ్‌వర్కర్లపై సాగుతున్న రాజకీయ వేధింపులను సిఐటియు ఆధ్వర్యాన అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘాల నాయకులు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. వేధింపులు, తొలగింపులు ఆపాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రాజకీయ వేధింపులతో ఎవరినీ తొలగించబోమని ఆయన హామీనిచ్చినా, క్షేత్రస్థాయిలో మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి.

సంక్షేమ హాస్టళ్ల స్థితిగతులపై నివేదిక

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి, ఆయా శాఖల ఉన్నతాధికారులకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు సారథ్యంలో నివేదికలు అందజేయనున్నట్లు కమిషన్ సభ్యులు గొండు సీతారాం తెలిపారు. నగరంలోని బలగలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, బిసి సంక్షేమ హాస్టళ్లను ఆదివారం పరిశీలించారు. మెనూ అమలు, భోజన నాణ్యత, హాస్టల్ సిబ్బంది పర్యవేక్షణ, మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం తదితర సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న తాత్కాలిక, దీర్ఘకాలిక సమస్యలపై పూర్తి సమాచారాన్ని సేకరించే పనిలో ఉన్నామన్నారు. గిరిజన, సాంఘిక, ఎస్‌సి సంక్షేమ, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాలు, మోడల్ స్కూల్స్, కెజిబివి, ఇతర సంక్షేమ హాస్టళ్లను


మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

సందర్శించి వాటిని పరిష్కరించేందుకు ఆయా శాఖల ఉన్నతాధికారులకు పలు నివేదికలు, సూచనలు, ఆదేశాలు జారీ చేసేందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో అడుగులు వేస్తున్నామని చెప్పారు. అంతిమంగా బాలల హక్కుల పరిరక్షణ ధ్యేయంగా తమ కమిషన్ పనిచేస్తోందన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి అనురాధ, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి ఆర్.కృష్ణవేణి మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుల ఆదేశాలు, సూచనలు, సలహాలను అనుసరించి రాష్ట్ర, జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి ఎం.శ్రీనివాసరావు, జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ, పలు శాఖల అధికారులు జనార్ధన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లిన ట్రిపుల్ ఐటి డైరెక్టర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి విద్యార్థుల తరగతి గదులు సరిపోవడం లేదని, అందువల్లే వారిని న్యూజివీడు నుంచి తీసుకురావడంలో జాప్యం జరుగుతోందని డైరెక్టర్ బాలాజీ, పరిపాలన అధికారి ముని రామకృష్ణలు అన్నారు. నగరంలోని కేంద్రమంత్రి క్యాంప్ కార్యాలయంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నాలుగు, ఆరో సంవత్సరాల విద్యార్థులు నూజివీడు క్యాంపస్‌లో ఉంటున్నారని, వీలైనంత త్వరగా శ్రీకాకుళం క్యాంపస్‌కి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని వివరించారు. కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా భవన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు.

ఎమ్మెల్యే గోవిందరావు...

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. నగరంలోని కేంద్రమంత్రి క్యాంప్ కార్యాలయంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. చిన్న వయసులోనే దేశ స్థాయిలో పేరు ప్రాఖ్యాతలు పొందినందుకు అభినందనలు తెలియజేశారు.


వినతిపత్రం అందజేస్తున్న బాలాజీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

'స్థానిక' ఎన్నికలకు సన్నద్ధం కావాలి

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పట్నుంచే టిడిపి శ్రేణులు సన్నద్ధం కావాలని ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. మండలంలోని డోకులపాడు మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన 40 వేల మెజారిటీ తనకు పెద్ద సన్మానమన్నారు. ఇకపై తనకు సన్మానాలు ఏర్పాటు చేయొద్దని పార్టీ నాయకులను సూచించారు. ప్రభుత్వం చేస్తున్న పనులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కక్షసాధింపులకు పాల్పడకుండా అర్హులైన వారికి తప్పనిసరిగా సంక్షేమ పథకాల అందించాలని సూచించారు. తప్పుడు ధ్రువపత్రాలతో పింఛన్లు పొందుతున్న వారిని విడిచిపెట్టబోమన్నారు. అన్న క్యాంటీన్లను త్వరలో ప్రారంభిస్తామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే నాటికి ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరిగేలా నాయకులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలపై టిడిపి నాయకులు దృష్టిసారించాలని సూచించారు. సహారా, అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. తీర ప్రాంత రహదారుల అభివృద్ధి చేయాలని గ్రామ పెద్దలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సూరడ మోహనరావు, నాయకులు పుచ్చ ఈశ్వరరావు, అరసవల్లి ఉమామహేశ్వరరావు, నెయ్యిల సూర్యనారాయణ, జనసేన నాయకులు ఎల్.గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.



లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు లయన్స్ క్లబ్ 316 జిల్లా గవర్నర్ ఎన్.వి.బి.ఎస్.ఎస్ ప్రసాద్ తెలిపారు. లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. లయన్స్ క్లబ్ పూర్వ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ నూతన అధ్యక్షులు సన్‌రైజ్ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ బొడ్డేపల్లి సురేష్‌కు గావెల్ అందజేశారు. అధ్యక్షులు సురేష్‌తో పాటు కార్యదర్శిగా సింధూర హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ పైడి సింధూర, కోశాధికారిగా జోగి భారతి, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా పి.రవికుమార్, ఉపాధ్యక్షులుగా డి.విష్ణుమూర్తి, బి.విశ్వేశ్వరరావు, డైరెక్టర్‌గా పి.నరేష్, మార్కెటింగ్ చైర్మన్‌గా యు.శివతేజ, మెంబర్‌షిప్ చైర్మన్‌గా బి.కృష్ణ చైతన్య, క్లబ్ సర్వీస్ చైర్మన్‌గా ఎం.కె మిశ్రో, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన అధ్యక్షులు డాక్టర్ సురేష్ మాట్లాడుతూ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి సమాజ సేవలో మరింత భాగస్వామ్యమవుతామన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ డి.ఎస్.ఎస్.వి వర్మ, రీజనల్ చైర్మన్ వి.వి రంగనాథ్, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, చాప్టర్ ప్రెసిడెంట్ నటుకుల మోహన్, పూర్వ కార్యదర్శి, కోశాధికారులు టి.రాంగోపాల్, శిల్లా మణి తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు

- మెరుగైన మౌలిక వసతులు
- క్షేత్రస్థాయిలో అనుభవమున్న నర్సింగ్ సిబ్బంది
- ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దాసరి షకీల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రజలకు ప్రభుత్వ వైద్యం ఉచితంగా అందించే లక్ష్యంతోనే సర్వజనాస్పత్రి సేవలందిస్తోందని జిల్లా సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దాసరి షకీల అన్నారు. సాధారణ జ్వరం మొదలు, ఎటువంటి శస్త్ర చికిత్సనైనా పూర్తి చేయడానికి అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారన్నారని అన్నారు. ఆస్పత్రిలో రోగులకు అవసరమైన అన్ని రకాల మౌళిక వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రయివేటు ఆస్పత్రుల్లో నయం కాని రోగాలకు సైతం ఇక్కడ సేవలు అందుతున్నాయని గుర్తుచేశారు. కోవిడ్ సమయంలో అది రుజువైందన్నారు. నిరంతరం వైద్యులు అందుబాటులో ఉండి వైద్యం అందిస్తున్నారని చెప్పారు. ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు.

? జిజిహెచ్‌లో ప్రస్తుతం ఒపి సంఖ్య ఎలా ఉంది?

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వైద్యం కోసం వచ్చే వారికి మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు కృషి చేస్తున్నారు. ఇన్, అవుట్ పేషెంట్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం రోజూ 450 నుంచి 500 మంది వరకు ఇన్ పేషెంట్లు వస్తున్నారు. ప్రసూతి విభాగంలో రికార్డు స్థాయిలో ప్రసవాలు, ఆపరేషన్లు చేస్తున్నాం. అయితే ఇంకా కొన్ని విభాగాలు నెలకొల్పాల్సి ఉంది. ప్రధానంగా జిల్లాలో కిడ్నీ వ్యాధులతో పాటు కేన్సర్ రోగుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. రిమ్స్‌లో ఏకైక సూపర్ స్పెషాలటీ నెఫ్రాలజీ మాత్రమే అందుబాటులో ఉంది. న్యూరో మెడిషన్, సర్జన్, ప్లాస్టిక్ సర్జరీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వంటి విభాగాలు రావాల్సి ఉంది. ప్రస్తుతం రోగికి ఎటువంటి సమస్య ఎదురైనా శస్త్ర చికిత్సల ద్వారా నయం చేసేందుకు వీలుటుంది. ప్రభుత్వం సూపర్ స్పెషాలటీ విభాగాలను ప్రారంభించడానికి అనువైన అన్ని అర్హతలు ఉన్నాయి.

? వైద్యసేవలు ఎంతమేరకు అందుతున్నాయి?

జిల్లాలో సాధారణ వ్యాధులతో వచ్చే వారికంటే దీర్ఘకాలిక రోగాలతో వచ్చే వారే ఎక్కువగా ఉన్నారు. వారు కొంత నిర్లక్ష్యంగా ఉండడంతో ఆలస్యంగా వైద్యుల వద్దకు వచ్చి పరీక్షలు చేయించుకుంటారు. అందువల్ల ఎక్కువగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటోంది. తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు రోగాన్ని నయం చేయాలంటే ఆధునిక పరికారాలు అవసరమవుతాయి. అటువంటి సౌకర్యాలు జిల్లాలో అందుబాటులో లేకపోవడం వల్ల ఇతర జిల్లాలకు పంపాల్సి వస్తోంది. సూపర్ స్పెషాలిటీ సేవలు మినహా మిగతా విభాగాల్లో రిఫరల్ కేసులు తగ్గాయి. ప్రస్తుతం నెఫ్రాలజీ మినహా మిగిలిన సూపర్ స్పెషాలటీ సేవలు అందుబాటులో లేవు. జనరల్ సర్జన్, జనరల్ మెడిషన్, గైనిక్, ఆర్థో, ఇఎన్‌టి, చర్మ వ్యాధులకు సంబంధించిన విభాగాలు సమర్థవంతంగా సేవలు అందిస్తున్నారు. సూపర్ స్పెషాలటీ సేవల్లో గ్యాస్ట్రో ఆంట్రాలజీ, ప్లాస్టిక్ సర్జన్, న్యూరో జనరల్, న్యూరో సర్జన్, గుండె, శ్వాసకోశ రోగులకు శస్త్ర చికిత్సలు అందించేందుకు వైద్య నిపుణులు ఉన్నారు. సూపర్ స్పెషాలిటీలో మరిన్ని విభాగాలు వస్తే పిజి సీట్లు పెరుగుతాయి. తద్వారా అటు విద్య, ఇటు వైద్యం అవసరాలు మెరుగుపడతాయి.





? మౌలిక వసతుల కల్పన, సౌకర్యాలు ఎంతమేరకు సమకూర్చారు?

రిమ్స్ వైద్య కళాశాలకు జిజిహెచ్ అనుబంధ ఆస్పత్రిగా ఉంది. కళాశాలలో కొత్తగా పిజి విద్యతో పాటు యుజికి 150 సీట్లను ఏటా భర్తీ చేయడం జరుగుతోంది. వారికి వేర్వేరుగా హాస్టల్ వసతులు ఉన్నాయి. స్థానికంగా ఉండే వైద్యులు మినహా మిగిలిన వారికి క్వార్టర్స్ కూడా నిర్మించారు. అయితే పూర్తిస్థాయిలో క్వార్టర్స్ అందుబాటులో ఉంచాలని భావించి మరమ్మతుకు గురైన వాటిని పునర్నిర్మాణం జరిగింది. నర్సింగ్ కళాశాల నిర్మాణంలో ఉండడంతో ప్రస్తుతం వారికి ఇక్కడే హాస్టల్ వసతి అందించారు. వారు ఖాళీ చేస్తే అదనపు సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. హాస్టల్ భవనాలు అదనంగా నిర్మించడం జరుగుతోంది. అనువైన స్థలం ఉండడం వల్ల కొత్తగా మంజూరైన భవనాలను నిర్మించుకుంటున్నాం. ప్రస్తుతం రూ.60 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో తరగతిగదులు, లైబ్రరీ, కాంప్లెక్స్, హాస్టల్ వసతి వంటివి నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

? ఉద్యోగుల సమయపాలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

వైద్యులు, ఉద్యోగులు సమయపాలన తప్పనిసరి. అందుకోసం బయోమెట్రిక్‌ను ఖచ్చితంగా అమలు చేస్తున్నాం. క్లోజ్ మోనటరింగ్ జరుగుతోంది. బయోమెట్రిక్ వేయకుండా మధ్యాహ్నం సమయంలో ఎవరైనా వెళ్తే వారికి కచ్చితంగా హాజరు నమోదు చేయడం లేదు. దీనివల్ల వీరి జీతంలో కోత పడుతుంది. కళాశాల ప్రిన్సిపాల్ ఆదేశాలను అనుసరించి కచ్చితంగా బయోమెట్రిక్ అమలువుతోంది. అందువల్ల మరింత మెరుగైన సేవలు అందించ గలుగుతున్నాం.

? సౌకర్యాల మెరుగునకు తీసుకున్న చర్యలు ఏమిటి?

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో రోగులకు అవసరమైన అన్నిరకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. క్యాంటీన్, లైబ్రరరీ, అదనపు వసతిగృహ సముదాయంతో పాటు తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించాం. ఉన్నత స్థాయిలో ఈ సమస్య పరిష్కారానికి ఇటీవల జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు సమక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చాం. ప్రభుత్వం నుంచి అవసరమైన నిధుల కోసం స్పష్టమైన హామీ ఇచ్చారు. నిధులు విధులైన తర్వాత తాగునీటి సరఫరా మెరుగు పరచుకునేందుకు వీలుంది.

విలువైనది స్నేహబంధం

శ్రీకాకుళం అర్బన్ : మానవ సంబంధాలు అన్నీ ఆర్థిక సంబంధాలుగా మారిపోతున్న ప్రస్తత పరిస్థితుల్లో స్నేహితుడు మాత్రమే ప్రతిఫలం ఆశించకుండా మన మంచిని కోరుకుంటారని, స్నేహం మాత్రమే ప్రపంచంలో అత్యంత విలువైన విడదీయరాని సంబంధమని శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్‌క్లబ్, ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో-ఆపరేషన్ అండ్ ఫ్రెండ్ షిప్‌తో కలిసి అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్నేహితుడు ఎలాంటి రక్త సంబంధం కాకపోయినా మనుషుల హృదయాంతరాల్లో నుంచి పుట్టికొని వస్తారని కొనియాడారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బొడ్డేపల్లి ప్రసాదరావు, బొడ్డేపల్లి సత్యం, సింహాద్రి పాల్గొన్నారు.


స్నేహితుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న వాకర్స్ ప్రతినిధులు


అవార్డు అందుకుంటున్న గురుమూర్తి

కళాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మరుగున పడుతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఉత్తరాంధ్ర స్థాయిలో ఏక పాత్రభినయం బాపూజీ కళామందిర్‌లో ఆదివారం జరిగింది. ఇందులో 30 మంది కళాకారులు పాల్గొనగా ఆరుగురు ఎంపికయ్యారు. రణస్థలం మండల కేంద్రానికి చెందిన కళాకారుడు బోనం గురుమూర్తి శ్రీకాళహస్తీశ్వర స్వామి మహత్యంలో అరద్విజుడు ఏకపాత్ర ప్రత్యేక అవార్డును పద్మశ్రీ అవార్డు గ్రహిత యడ్ల గోపాలం, ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ తనలో ఉన్న ప్రతిభను గుర్తించి ఈ అవార్డు అందుకోవటం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీనిసంగీత దర్శకుడు లీలా మోహన్, రాజబాబు, జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షులు చిట్టి వెంకటరావు, గౌరవ అధ్యక్షులు లోకనాధం రామస్వామి, సన్నాల నరసింహమూర్తి పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

సహారా బాధితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

సహాయ బాధితులను ఆదుకోవాలని సహారా కస్టమర్స్, ఫీల్డ్ వర్కర్స్ యూనియన్ సంఘ అధ్యక్షులు సత్యరాజ్ కోరారు. ఈ మేరకు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో రూ.500 కోట్లు సహారా సంస్థ ద్వారా చెల్లించాల్సి ఉందన్నారు. సిఆర్‌సిఎస్ అనే పోర్టల్ ద్వారా ప్రతి ఖాతాదారుడికీ సొమ్ము జమచేస్తామని 2023లో కేంద్ర హోమ్‌శాఖ మంత్రి అమిత్ షా హామీనిచ్చారని గుర్తు చేశారు. కానీ, ఇంతవరకు ఐదు శాతం కూడా చెల్లింపులు చేపట్టలేదన్నారు. దీనివల్ల సహారా కస్టమర్లు, ఏజెంట్లు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కాశీవిశ్వనాథం, మాధవరావు, రూప్ సుందరరావు, జ్యూజిస్టు పండ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి సాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని అక్కివరంకు చెందిన జి.విద్యాసాగర్ పిసి 2962 తిరుపతి జిల్లా వై.వి. పాలెం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఆదివారం ఉదయం ఆయన మృతదేహాన్ని అక్కివరం తీసుకువచ్చారు. తిరుపతి జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి అభ్యర్థన మేరకు జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్. కృష్ణంనాయుడు, కార్యవర్గ సభ్యులు కె.భుజంగరావు, నరసింహులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణలు విద్యాసాగర్ భౌతికకాయానికి నివాళ్లర్పించి ఆయన తల్లి గోరింట జనార్థనమ్మకు మట్టిఖర్చులు కింద రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో అక్కివరం సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి నీలారావు, లక్షణ మాష్టారు, శ్రీకాకుళం టూ టౌన్ హెచ్‌సి సత్యన్నారాయణ, కానిస్టేబుళ్ల దామోదర్, జితేందర్ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న లయన్స్ హర్షవల్లి సభ్యులు

అంధులకు నిత్యావసర సరుకులు

శ్రీకాకుళం అర్బన్: లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యాన ఆదివారం డాన్ టు డస్క్ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని స్విమ్మింగ్ పూల్ ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం నరసన్నపేటకు చెందిన అంధులకు నిత్యావసర కిట్లను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు హారికా ప్రసాద్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఆఫ్ హర్షవల్లి ఆధ్వర్యాన ఈ ఏడాది 5 వేల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ ఛైర్మన్ కరణం శోభారాణి, గవర్నర్-1 సూర్యప్రకాశరావు, మాజీ వైస్ ఛాన్స్‌లర్ ఎస్ఆర్‌కె రామకృష్ణారావు, ఆర్.రంగనాథం, క్లబ్ అధ్యక్షులు జగన్నాథం నాయుడు, ఉపాధ్యక్షులు అప్పలనాయుడు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు

పొందూరు: పొందూరు లయన్స్‌క్లబ్‌లో డస్క్ టూ డాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా గవర్నర్ ఎన్.బి.వి.ఎస్.ఎస్.ప్రసాద్ చేతులమీదుగా ఆదివారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఇటీవల నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో గుర్తించిన 17 మంది విద్యార్థులకు కళ్లద్దాలు అందజేశారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్థానిక సిస్టమ్ కళాశాల ఆవరణంలో 20 మొక్కలను నాటారు. కార్యక్రమంలో లయన్స్ రీజన్ చైర్‌పర్సన్ వి.వి.రంగనాథ్, జోన్ చైర్‌పర్సన్ రవికుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్, టెజరర్ రామకృష్ణారావు, పొందూరు లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ ఎ.కళ్యాణి, క్లబ్‌సభ్యులు కుమారి, ధర్మారావు, సూర్యనారాయణ, సతీష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆశ్రమం సందర్శన

రణస్థలం రూరల్: మండల కేంద్రంలో ఉన్న గులాం ఖాదర్ జిలాని ఎడ్ల సీతారామయ్య ఆశ్రమాన్ని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శివశంకర్ సందర్శించి బాబాను దర్శించుకున్నారు. ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా శివశంకర్ ఆశ్రమాన్ని సందర్శించారు. జనసేన ద్వారా ప్రజలకు మంచి జరిగేలా మంచి కార్యక్రమం నిర్వహించాలని సాంబశివరావు బాబా ఆకాంక్షించారు. ఆయనతో పాటు జనసేన సీనియర్ నాయకులు బాడాన జనార్దన, వెంకటరావు ఉన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

పొందూరు: పట్టణ కేంద్రంలో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్కరికీ రూ.5లక్షలు ప్రమాద బీమా, ప్రమాదం కారణంగా తీవ్రంగా గాయపడిన వారికి రూ.50 వేలు అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన జిల్లా జనరల్ సెక్రటరీ కొంచాడ చిన్నంనాయుడు, మండల అధ్యక్షులు యలకల రమణ, ఉపాధ్యక్షుడు కొరాడ రాజు, ప్రధాన కార్యదర్శి బెల్లాన శివకుమార్, కార్యదర్శి జరజాపు గణేష్, పట్టణ సీనియర్ నాయకులు శివ, గోవింద, దినేష్, వినోద్, ప్రసాద్ పాల్గొన్నారు.

అరసవల్లికి వెండి వస్తువులు విరాళం

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని ఆదివారం సందర్శించిన విశాఖ వాసి ఎన్.శ్రీమన్నారాయణ విరాళంగా వెండి ఉద్ధరిని, వెండి పంచ పాత్ర, వెండి ప్లేట్ సుమారు 405.22 గ్రాముల వెండి వస్తువులను ఆలయ ఇఒ ఎస్. చంద్రశేఖర్‌కు ఆయన కార్యాలయంలో వీటిని అందజేశారు.

గ్రానైట్ పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

గ్రానైట్ క్వారీలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మరుసటి రోజు నుంచి పనులు నిలుపుదల చేయడంతో గ్రానైట్ కంపెనీలు నష్టాల్లోపడ్డాయి. నేటికి సుమారు రెండు నెలలు కావస్తున్నా క్వారీల పనులు పునఃప్రారంభం కాకపోవడంతో గ్రానైట్ కంపెనీల్లో ఉన్న మిషన్‌ల అద్దెలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలు యాజమాన్యాలు తెలుపుతున్నారు. ఎప్పటికీ తెరుస్తారో తెలియని పరిస్థితిలో యాజమాన్యాలు ఉన్నాయి. అయితే తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వలస కార్మికులకు మెస్‌లు నడుపుతుండంతో మరింత భారం యాజమాన్యాలపై పడుతుందని పలు యాజమాన్యాలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికులను పంపించిస్తే మరలా తేవడానికి కష్టతరం అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం గ్రానైట్ క్వారీలపై నియమ నిబంధనలు ప్రకటించి క్వారీలకు అనుమతులు ఇవ్వాలని యాజమాన్యాలు కోరుతున్నాయి.

పర్మిట్లు ఇవ్వాలి



ప్రభుత్వం విధివిధానాలు రూపొందించి గ్రానైట్ కంపెనీలకు అనుమతులు ఇవ్వాలి. ఇప్పటికే రెండు నెలలు పనులు లేక మిషన్లు అద్దెకట్టే పరిస్థితి ఏర్పడింది. టెక్కలిలో 125 క్వారీలు ఉన్నప్పటికీ 40 క్వారీలు నడుస్తున్నాయి. ప్రభుత్వం గ్రానైట్ పరిశ్రమలకు అనుగుణంగా విధి విధానాలు రూపిందిస్తే పూర్తిస్థాయిలో క్వారీలు నడపడానికి యాజ మాన్యాలు సిద్ధంగా ఉన్నాయి.

- చింతాడ గణపతిరావు,
గ్రానైట్ అసోసియేషన్ ఉత్తరాంధ్ర మాజీ అధ్యక్షులు


గ్రానైట్ క్వారీ

కార్మికులకు పనులు కల్పించాలి



తమిళనాడు, ఒడిశా, బీహార్ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు నెలలుగా పనులు లేక ఇంటి అద్దెలు కట్టలేక సతమతమవుతున్నారు. యాజ మాన్యాలను కార్మికులు ప్రశ్నిస్తుంటే ప్రభుత్వం పర్మిషన్ ఇవ్వలేదని చెబుతున్నారు. ప్రభుత్వం గ్రానైట్ కంపెనీలకు అనుమతులు ఇచ్చి కార్మికులకు పనులు కల్పించాలి.

ఎన్.షణ్ముఖరావు, సిఐటియు నాయకులు


ఆమదాలవలస : సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- ఆమదాలవలస

సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న కాలుష్య నివారణతో పాటు పర్యావరణ పరిరక్షించడానికి ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పురపాలక సంఘం పరిధిలోని మెట్టక్కివలస అర్బన్ హెల్త్ సెంటర్‌లో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో మొక్కల పెంపకం పేరుతో కోట్ల రూపాయలు దుర్వినియోగం చేశారన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మొక్కల పెంపక కార్యక్రమాన్ని నిరంతర ఆధ్యాత్మికత భావనతో ఉన్న సత్యసాయి సమితికి అప్పగించడం అభినందనీయమన్నారు. సత్యసాయి సమితి చేపట్టిన ఈ ప్రేమ తరు కార్యక్రమానికి తనవంతు సహకారం అందించడంతో పాటు పురపాలక సంఘ పరిధిలో ఉన్న 134 చెరువుల పరిసర ప్రాంతాల్లో మొక్కల పెంపకం చేపట్టేందుకు సహకరిస్తానని తెలిపారు. సత్యసాయి జిల్లా సంఘ అధ్యక్షులు సూరు రామచంద్రరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రధాని మూడు కోట్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని సాయి భక్తులకు కేటాయించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ కుమారి, సత్యసాయి సమితి ప్రతినిధులు డాక్టర్ పి.తాతయ్యలు, ఎం. రవీంద్ర బాబు, కె. ప్రహ్లాదరావు, జనార్దనరావు, అవధానులు, అన్నెపు సత్యనారాయణ, గజపతిరావు పాల్గొన్నారు.

పలాస: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని టిడిపి పట్టణ అధ్యక్షులు సప్ప నవీన్ అన్నారు. స్థానిక పురుషోత్తపురం కాలనీలో సత్యసాయి సేవాదళ్ ఆధ్వర్యాన ఆదివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో సేవాదళ్ కో-ఆర్డినేటర్ పి.శ్రీనివాసరావు, మల్లా రామేశ్వరరావు, మల్లా శరత్, జె.శ్రీనివాస్, భైరాగి, పి.కొండలరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: సత్యసాయి సంస్థల ఆధ్వర్యాన నగరంలో నిర్వహిస్తున్న ప్రాథమిక అర్బన్ ఆస్పత్రి ఆవరణలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరై మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆయన సతీమణి, పొందూరు మాజీ ఎంపిపి కూన ప్రమీల పాల్గొన్నారు.

అరసవల్లికి తగ్గిన రద్దీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆషాడ మాసం చివరి ఆదివారం అమావాస్య కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రద్దీ తగ్గింది. దీంతో ఒక్కరోజు రూ.2.06 లక్షల మేరకు ఆదాయం సమకూరింది. టికెట్లు విక్రయాల ద్వారా రూ.36,600, విరాళాల రూపంలో రూ.53,850, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,16,145 ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.


దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 222వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా ఆదివారం దీక్షలో ప్రగడపుట్టుగ యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు గుర్తింపు లభించే వరకూ, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

ప్రవీణ్‌కుమార్ జన్మదినం

నరసన్నపేట: జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు ఆదివారం పట్టణంలో నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రవీణ్ కుమార్‌కి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అదేవిధంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నాయకులు డోల జగన్, మెండ రాంబాబు, తమ్మినేని భూషణరావు, కరుకోల రమేష్, పంగ బావాజీ నాయుడు, వైకుంఠరావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య శిబిరానికి స్పందన

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ ఆధ్వర్యాన మండలంలోని పాటిసున్నాపురంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన లభించింది. డెంటల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. మెగా వైద్య శిబిరానికి ప్రాజెక్టు చైర్మన్‌గా డాక్టరు వేదవ్యాస్, డాక్టర్ ప్రేమకుమార్ జెన్నా, డాక్టర్ లక్ష్మి, అమ్మ ల్యాబ్ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు దినేష్‌కుమార్, రోహిత్, నవీన్‌కుమార్, పాకదాస్, వి.కె.ప్రసాద్, జోగారావు, నవీన్ చౌదరి, ప్రఫుల్ల, షణ్ముఖ, ప్రదీప్, గోపీచౌదరి పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

కవిటి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని దుగాణపుట్టుగ సర్పంచ్ డి.భద్రాచలం అన్నారు. గ్రామంలోని జ్ఞానోదయ గ్రంథాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞానోదయ కేంద్రాలని, విద్యార్థులు, యువత వాటిని వినియోగించుకోవాలని కోరారు. అలాగే మొక్కలు నాటుదాం - పర్యావరణాన్ని రక్షించుకుందాం కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వాహకులు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం గ్రామంలో రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో దివాకర్, సిసింద్రీ, దుర్గాప్రసాద్, జ్ఞానేశ్వర్, మురళి, హేఎవచలపతి, హరి, డి.తిరుపతి పాల్గొన్నారు.

ఆర్‌టిఐ మండల అధ్యక్షునిగా కాళీ సాహు

ప్రజాశక్తి- కవిటి


కాళీ సాహు

ఆర్‌టిఐ మండల అధ్యక్షునిగా బొరివంకకు చెందిన కాళీ సాహు నియమితుల య్యారు. మండలంలోని బొరివంకకు చెందిన కాళీ సాహు ఉద్దానం ప్రాంతంలో మొట్టమొదటి సారిగా రక్తదానంపై ప్రజల్లో అపోహలు తొలగించి, విరివిగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ హెల్పింగ్ హెండ్స్ స్వచ్ఛంద సంస్థలో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ లో భాగమైన ఆర్‌టిఐ అధ్యక్షునిగా కాళీ సాహుకు పలువురు అభినందనలు తెలిపారు.

సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి/రూరల్

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం రాష్ట నాయకులు ప్రమోద్‌కుమార్ పాడి డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జిల్లాస్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవశాస్త్ర పాఠ్య పుస్తకాలు మరింతగా విస్తృత సమాచారంతో రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా అధ్యక్షులు పుట్టా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఓరియంటేషన్ శిక్షణా తరగతులు నిర్వహణకు జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పుజారి గోవిందరావు మాట్లాడుతూ పాఠశాల కాంప్లెక్స్‌స్థాయిలో జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరాన్ని విస్తృతం చేయాలన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జ్యోతిష్ట బెహరా, కె.లక్ష్మీపతి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు చల్లా రామారావు, టి.లోకేశ్వరరావు, పి.ధనుంజయరావు, పి.రమణ, బొడ్డేపల్లి శేషగిరిరావు, మల్లేశ్వరరావు, త్రివిక్రమరావు పాల్గొన్నారు.


టెక్కలి : డిమాండ్ చేస్తున్న ఫోరం ఉపాధ్యాయులు

నరసన్నపేట : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎపి జీవశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా అధ్యక్షులు పుట్టా ఉదయ్ కుమార్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, జిల్లా కోశాధికారి వి.త్రివిక్రమరావు, నరసన్నపేట, పోలాకి, జలుమూరు మండలాల జీవశాస్త్ర ఉపాధ్యాయులు దంత లక్ష్మణరావు, వాన సింహాచలం, పరపతి వసంతరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సన్మానగ్రహీతలతో తులసీదాస్‌రెడ్డి

'స్వర్ణభారతి'లో ఫ్రెషర్ డే

ఇచ్ఛాపురం: విద్యార్థులు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అభ్యసించి, భవిష్యత్‌లో సమాజానికి, దేశానికి సేవ చేయాలని, ఉన్నతమైన స్థానాలను అధిరోహించాలని స్వర్ణభారతి విద్యాసంస్థల చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి అన్నారు. సానిక స్వర్ణభారతి జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సర విద్యార్థులు, ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగత కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితుల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం రాష్ట్ర, జిల్లాస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన పాల శ్రేయ, అన్వేష, త్రిపాటి, శ్రావణ్‌కుమార్, పిట్ట లావణ్య, అంకితా నంద, నమిత, గజపతి, గుజ్జు కావేరితో 30 మంది విద్యార్థులకు దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చాట్ల సుజాతారెడ్డి, కళాశాల ఇన్‌ఛార్జి చాట్ల రాముర్రెడ్డి, కో-ఆర్డినేటర్ నీలిమారెడ్డి, నలీనారెడ్డి, ప్రిన్సిపాల్ జిల్లు జయప్రకాష్, సందీప్, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

ప్రజాశక్తి- కొత్తూరు

స్నేహితులు దినోత్సవాన్ని పురస్కరించుకొని భగత్‌సింగ్ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులు గోగుల రామారావునాయుడు, రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో స్థానిక కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బి.రాజు పాల్గొని మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వందలాది మందికి పునర్జనమనిచ్చేలా భారీగా రక్తదానం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ట్రస్టు గౌరవాధ్యక్షులు డాక్టర్ ఆగతముడి అప్పలనాయడు మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పిలుపునిచ్చారు. రక్తం ఎంతో విలువైందని, డబ్బుతో కొనగలిగేది కాదని తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ రక్తదాతలు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఆపదలో ఉన్నవారు రక్తం దొరకక ఎంతో మంది ప్రాణాలు పోగొట్టుకొంటున్నారని తెలిపారు. ఇబ్బందులకు గురవుతుంటారని అటు వంటి వారికి రక్తదానం చేయడం వల్ల వారి ప్రాణాలు కాపాడిన వారమవుతామని అన్నారు. విశ్రాంత ప్రిన్సిపాల్ ఎద్దు గోపాల్‌దాస్ నాయుడు మాట్లాడుతూ ఆరు నెలలకొకసారి రక్తదానం చేయవచ్చునని అన్నారు. ఈ సందర్భంగా 104 యూనిట్లు రక్తాన్ని ట్రస్టు సభ్యులు సేకరించారు. అనంతరం రక్తదాతలకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు ఎస్.హరి, భగవాన్, కె.పోలీనాయుడు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

చంద్రబాబును విమర్శించే స్థాయి లేదు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సిఎం చంద్రబాబును విమర్శించే స్థాయి వైసిపి నాయకుడు చింతాడ రవికుమార్‌కు లేదని టిడిపి జిల్లా పార్లమెంటరీ పార్టీ కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్ అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడుతూ శనివారం కొన్ని పత్రికల్లో చంద్రబాబు కనుసన్నల్లోనే ఇసుక దోపిడీ అంటూ వైసిపి నాయకుడు రవికుమార్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉన్నత చదువులు చదివి ప్రొఫెసర్‌గా పనిచేసిన రవి కుమార్‌కు చట్టాల విధానాలపై అవగాహన లేనట్లు ఉందన్నారు. విషయం తెలియకుండా మాట్లాడటం ఇకనైనా మానుకోవాలని లేకుంటే ప్రజల్లో చులకన కాక తప్పదన్నారు. నారాయణపురం ఆనకట్ట ఆధునికీకరణకు టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జైకా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారని, ఆ తరువాత వచ్చిన వైసిపి ఆ పనులను నిలిపి వేసిందన్నారు. మళ్లీ నేడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నది పక్కన కాఖండ్యాం దగ్గర జిఒ ఎంఎస్ నెంబర్ 43 పేరిట జూన్ 8న జిఒ విడుదల చేసిందన్నారు. నదిలో పేరుకు పోయిన సిల్టు తొలగించడానికి రూ.60 లక్షలతో జిఒ ఇచ్చిందని ఆ ప్రాతి పదికన పనులు ప్రారంభించారని తెలిపారు. జెసి ఎంటర్ప్రైజెస్ సంస్థ వైసిపి హయాంలో 2026 వరకు లైసెన్స్ తీసుకున్నారన్నారు.

ఆ కంపెనీ వారే ప్రస్తుతం 100 ఎమ్ఎమ్, 150 ఎమ్ఎమ్ లోతు వరకు వెళ్లి ఇసుక తీయడానికి అలాగే 72,250 మెట్రిక్ టన్నుల ఇసుకను తరలించడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఆ విషయాన్ని క్షుణ్ణంగా తెలుసు కోకుండా లేనిపోని ఆరోపణలు చేస్తూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి బిసిసెల్ కార్యదర్శి బోర గోవిందరావు, టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూక రాజు, బొడ్డేపల్లి గౌరీపతి, అన్నెపు భాస్కరరావు, ఉదయ్ కుమార్, సదాశివుని వెంకటేశ్వరరావు, ఎండ అప్పల నాయుడు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

నౌపడ : సంతబొమ్మాళి మండలం భావనపాడుకు చెందిన బై.సోమేశ్వరరావు 20 రోజులుగా మెదడు సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నిరుపేద మత్స్యకార కుటుంబానికి చెందిన కావడంతో వైద్య ఖర్చులకు అధిక మొత్తంలో డబ్బులు అవసరమై దాతల కోసం ఎదురుచూస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామంలోని వాడపేటకు చెందిన సి ఫేరర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం రూ.16 వేలు ఆయన భార్య నీలవేణికి అందజేశారు. కార్యక్రమంలో ఎం.రాజారావు, కె.రవి, కె.రాజు, బి.గురుమూర్తి, బి.రామకృష్ణ, ఎ.రామారావు, ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు


చికిత్స చేస్తున్న వైద్యాధికారి వెంకటేష్

పిచ్చికుక్క స్వైరవిహారం

సోంపేట : మండలంలోని పాలవలసలో ఆదివారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి ఆరుగురిని కరిచింది. దీంతో గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన సంగారు దూదమ్మతో పాటు పలువురిని పిచ్చికుక్క కలవడంతో కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొందరు, సోంపేట ప్రభుత్వాస్పరతిలో కొందరు చికిత్స చేయించుకున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సైలజను వివరణ కోరగా, కుక్కను పట్టుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అలాగే బాధితులకు సరైన చికిత్స అందించేందుకు ఏర్పాటు చేశామని అన్నారు. స్థానిక టిడిపి నాయకుడు చెల్లూరి ధర్మారావు బాధితులను ఆస్పత్రికి చేర్చి సహాయక చర్యలు చేపట్టారు.

షెడ్యూల్డ్ వర్గీకరణ రాజ్యాంగానికి వ్యతిరేకం

కోటబొమ్మాళి: షెడ్యూల్డ్ తరగతులను వర్గీకరణ చేయడంపై సుప్రీంకోర్టు తీర్పు తరగతులు, మతాల మధ్య చిచ్చు పెట్టడమేనని, దీనిని దళిత సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని మండల దళిత నాయకులు కరజాడ భాస్కరరావు, బోకర జడ్డెన్న, దువ్వారపు సింహాచలం, కూన మల్లేసు, సామసంజీవరావులు అన్నారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభలు, పార్లమెంట్, గవర్నర్లు, రాష్ట్రపతి ఆయోదం చేసి చట్టాలు చేయాలి తప్ప సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వర్గీకరణ చేయాలని చెప్పడం సరికాదని అన్నారు. ఇలా చేస్తే యావత్తు భారత దేశంలోని షెడ్యూల్డ్ తరగతుల్లో వివాదాల వస్తాయని, దీనిని పునఃపరిశీలించాలని కోరారు. బిసి, ఓసిల్లో ఎస్‌టిల్లో కూడా తరగతులు ఉన్నాయని, మరి వాళ్లను వర్గీకరిస్తారా? అని ఆవేదన చెందారు.


ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

ఆర్థికసాయం అందజేత

కవిటి: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కవిటికి చెందిన కొంతమంది స్నేహితులు కవిటికొత్తూరుకు చెందిన ఆర్థోపెటిక్ వ్యాధిగ్రస్తుడు రామిసెట్టి దొంబురుకు రూ.పది వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో పాండవ చంద్రశేఖర్, బెందాళం రమేష్, ఆరంగి మధు, బాలక శ్రీను, బెందాళం మల్లేశ్వరరావు, పొల్లాయి ఉమా, భావన రవి, పి.వెంకట్రావు, జె.లోకనాథ్, ఆర్.వెంకట్రావు, సిహెచ్.పాపారావు, టి.మోహన్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో అభివృద్ధి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఐకమత్యంతో విశ్వకర్మ కుటుంబాలు అభివృద్ధి చెందుతాయని కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు లక్కోజు ధర్మారావు అన్నారు. వజ్రపు కొత్తూరులో సంఘ సభ్యుల ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వకర్మలు తమలో తాము సహకరించుకుని సంఘటిత శక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. రానున్న విశ్వకర్మ, కంచికామాక్షి పూజలు ఘనంగా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో కంచుమోజు కేశవరావు, కొత్తూర్తి జగ్గారావు, బూరగాపు చింతామణి, లాక్కొజు ప్రసాద్, రమణ, భాస్కరావు పాల్గొన్నారు.

జనసేన జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

కేశవరావుపేటలో ఎచ్చెర్ల మండల జనసేన పార్టీ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాస్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మిరెడ్డి శివశంకర్ హాజరై మాట్లాడుతూ పార్టీ కోసం ప్రతిఒక్క జన సైనికుడు పనిచేయాలన్నారు. పార్టీ సిద్ధాంతం తూచా తప్పకుండా పాటించి పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమౌళి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, జనసేన నాయకులు. బాడన జనార్ధన్, నాలుగు మండలాల అధ్యక్షులు, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

విద్యా ప్రగతికి ఉపాధ్యాయులే పునాది

పోలాకి: విద్యార్థుల్లో విద్యా ప్రగతి సాధించాలంటే ఉపాధ్యాయులే పునాదులు వేయాలని ఎంఇఒ-2 లింగరాజు సూచించారు. మండల పరిషత్ కార్యాల యంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలపై ఎంఇఒ శ్రీనివాస్ నాయిక్ అధ్యక్షతన ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ స్కూల్‌లో జరిగే ఎన్నికల్లో ప్రధానోపాధ్యాయులు బాధ్యత వహించాలన్నారు. పాఠశాలలో అన్నిరకాల రికార్డులు కచ్చితంగా ఉండాలని సూచించారు. నూతన విద్యావిధానంపై పలు సూచినలు చేశారు. విద్యార్థులకు ప్రాథమిక పాఠశాలలో ప్రవేశ అనే 90 రోజుల కార్యక్రమం పూర్తిగా బోధిస్తే విద్యార్థులకు పునాదైన క్షరాస్యత, గణితంలో పట్టుసాధిస్తారని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి ప్రకటించాలి

ఆమదాలవలస: లక్ష్మీనగర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో దాస్యం లక్ష్మణరావు అధ్యక్షతన ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 30 శాతంతో మధ్యంతర భృతి ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారి హెచ్.వి .సత్యనారాయణ, నాయకులు ఎన్. చంద్రశేఖరరావు, సత్యనారాయణ, కె.షణ్ముకరావు, సూర్య నారాయణ, పివిఎన్ మాస్టారు, పి.బానోజీరావు, నారాయణరావు, సంజీవరావు, కె.వి.రాజారావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం

నౌపడ: సంతబొమ్మాళి మండలంలోని భావనపాడు, మేఘవరం, మూలపేట సముద్రతీరాల్లో ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. నౌపడలో ఫ్రెండ్స్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యాన యువకులు స్నేహితులు దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో కేక్ కట్ చేసి ఆనందంతో చిందులేశారు. కార్యక్రమంలో రాజా, బాలకృష్ణ, సంతోష్, టెండుల్, చిన్నిబాబు, భీమా, ఉమామహేష్ పాల్గొన్నారు.